క్లుప్తంగా

వినూత్నంగా విద్యా బోధన



మాట్లాడుతున్న సీఎంఓ ప్రభాకరరావు

సరుబుజ్జిలి: నూతన పోకడల్లో విద్యా బోధనలు సాగించినప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని సమగ్ర శిక్ష సీఎంఓ పేడాడ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రొట్టవలస హైస్కూల్‌లోని బుధవారం నిర్వహించిన క్లస్టర్ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఎస్ఈఆర్టీ ద్వారా విషయ నిపుణలతో దూరదృశ్య విధానం మాదిరి పాఠ్యాంశాల బోధన సాగుతుందన్నారు. సమగ్రశిక్ష ఐఈడీ కోఆర్డినేటర్ బి.గోవిందరావు, హెచ్ఎం కత్తిరి రామకృష్ణారావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతికి సంతాపం



సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ (పాలిటెక్నికల్ కళాశాల) గేదెల వెంకటకృష్ణారావు నాయుడు (88) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈయన శ్రీకాకుళం పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. ఈయన మృతి పట్ల మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నాయకులు సంతాపం తెలియజేశారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జలుమూరు: లింగాలవలస ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను హెచ్ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, జల్లు రమణమూర్తి, గార విశ్వనాథం, చింతా దమయంతి కుమారి, డొంకాన కాత్యాయని, కర్రి భాగ్యలక్ష్మి, సీఆర్పీ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

ఆమదాలవలస: పట్టణంలోని రోజువారి ఆశీలు వసూలుతోపాటు కబేళా నిర్వహణ, మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చింతాడ గ్రామంలోని వారపు సంతలో ఆశీలు వసూలుకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. చింతాడ సంత ఆశీలు వసూలుకు రూ.7,23,753 లని అధికారులు ప్రకటించారు. సాల్వెన్సీలు కట్టి పాటలో పాల్గొనేందుకు వచ్చిన చింతాడ గ్రామ వాసులు సిండికేట్ అయి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. మార్కెట్‌లో ఆశీలు వసూలుకు రూ.18.24 లక్షలని ప్రకటించారు. దీనికి ముగ్గురు వ్యక్తులు సాల్వెన్సీలు చెల్లించారు. ఇందులో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు వెళ్లిపోవడంతో మిగతావారు చాలా సమయం వేచి ఉన్నారు. చివరకు వేలంపాట నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

స్మార్ట్ క్లాస్ రూమ్ ఏర్పాటు



ప్రాజెక్టర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ, తదితరులు

పొందూరు: బెజ్జిపురం యూత్ క్లబ్, ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగళూరు సహకారంతో పొందూరు హైస్కూల్‌లో స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రూ.లక్ష విలువ చేసే స్మార్ట్ క్లాస్ రూమ్‌లో ప్రాజెక్టర్, లాప్‌టాప్, స్క్రీన్ స్పీకర్స్‌ను డీఈఓ తిరుమల చైతన్య చేతులు మీదుగా పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఎంఈఓ-2 పట్నాన రాజారావు, బెజ్జిపురం యూత్ క్లబ్ సభ్యులు శ్రావణి, అప్పల నాయుడు పాల్గొన్నారు.

నేడు సామాజిక ప్రజావేదిక

పొందూరు రూరల్: ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలో 2023-24లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజావేదిక ఉంటుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ, ఏపీడీలు హాజరవుతారన్నారు.

కేజీబీవీ తనిఖీ

హిరమండలం: విద్యార్థులు పరీక్షల వేళ మానసికంగా, ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ కమిటీ మెంబర్ బి.కాంతారావు అన్నారు. బుధవారం రాత్రి హిరమండలంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. సర్వశిక్ష అభియాన్ డీసీడీఓ నీరజ, తహసీల్దార్ హనుమంతురావు, ఎస్ఓ ఎస్.కృష్ణవేణి ఉన్నారు.

జనం కోసం జగన్

- పేదల పక్షాలన నిలుస్తామన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు
- హామీల అమలుకు కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తాం..
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

నరసన్నపేట: జనం కోసమే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపిస్తున్నారని, పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా నెలకొల్పిన వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న మనం పేదల పక్షాన నిలవాలని, ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఓపిక పట్టాలన్నారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, ముద్దాడ బైరాగినాయుడు, జీవీ రమణి, సదాశివుని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, నాయకులు

ఆమదాలవలస: ప్రజా సంక్షేమం కోసం ఆవిర్భవించి పనిచేసేది ఒక్క వైఎస్సార్‌సీపీయే అని మాజీ స్పీకర్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమదాలవలస పట్టణంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఇక్కడ నుంచి బయలదేరి శ్రీకాకుళంలో జరుగుతున్న యువత పోరు కార్యక్రమానికి వెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, ముఖ్య నాయకుడు బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

పాతపట్నం, కొత్తూరులో..



పాతపట్నం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: మెట్టూరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

పాతపట్నం: స్థానిక ఆస్పత్రి కూడలి వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ ఆర్టీఐ వింగ్ విభాగం అధ్యక్షుడు ఏనుగుతల సూర్యానారాయణ (సూర్యం) ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1లో వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యం



కేక్ కట్ చేసి పంచిపెడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: బలహీనవార్గల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలను వేశారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంచి పెట్టారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైఎస్సార్ సీపీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, శిమ్మ సాంబ శివరావు, ముగడ జనార్దన, కెల్ల గణపతి, కాగాన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశయాల కోసం..



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: ప్రజల ఆశలయాల కోసం వైఎస్సార్‌సీపీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించారని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆమదాలవలస పట్టణంలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఓవర్ బ్రిడ్జి వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా బయల్దేరారు.

అన్ని వర్గాల అభివృద్ధికి..



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దుంపల లక్ష్మణరావు, నాయకులు

పొందూరు: స్థానిక అంబేడ్కర్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర కళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు అన్నారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, బాడాన వెంకట కృష్ణారావు, చింతాడ ప్రసాద్, వడగా పద్మ, కూన రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతాడను అడ్డుకున్న పోలీసులు

- ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్
- నినాదాలు చేసిన పార్టీ శ్రేణులు, యువకులు



చింతాడ సమీపంలో రోడ్డుపై బైఠాయించిన చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు అన్యాయం జరగడంతో వారికి అండగా ఉంటూ శాంతియుత పోరాటానికి వెళ్తున్న తమను అడ్డుకునే హక్కు మీకు ఎవరు ఇచ్చారని పోలీసులను ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. యువత పోరు కార్యక్రమానికి ఆమదాలవలస నుంచి బయల్దేరి వెళ్తున్న రవికుమార్‌ను పట్టణ శివారులోని చింతాడ గ్రామం సమీపంలో బుధవారం పోలీసులు అడ్డుకున్నారు. రహదారిపై వాహనాలను నిలిపివేశారు. యువకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో అక్కడ చేరుకొని విడిచిపెట్టాలని రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని భావించిన పోలీసులు వారిని సుమారు 30 నిమిషాల తరువాత విడిచిపెట్టారు. పార్టీ ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన పార్టీ ముఖ్య నాయకులు బెవరమల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, పాడుగు శ్రీనివాసరావు, సువ్వారి నేతాజీ, గురుగుబెల్లి శ్రీనివాసరావు, బద్రి రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కామదహనోత్సవం



జలుమూరు: కామదహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు: డోలోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీముఖలింగేశ్వరుని కామదహనోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో దక్షిణ ముఖంగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి కుంటలు నిర్మించాలి

నరసన్నపేట: జిల్లాలో 2537 నీటి కుంటల నిర్మాణ పనులు జరుగుతున్నాయని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. నరసన్నపేట పరిధిలోని దేశవానిపేట వద్ద నీటి కుంట నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. గ్రామాల్లో వీటి నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కో మండలంలో కనీసం వంద నుంచి 120 వరకు నిర్మించాలనే లక్ష్యాలను విధించినట్లు చెప్పారు. ఒక్కో నీటి కుంట నిర్మాణానికి గరిష్టంగా రూ.60 వేలు వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు. నరసన్నపేట మండలంలో నీటి కుంటల నిర్మాణ తీరును ఏపీఓ యుగంధర్‌ను అడిగి తెలుసుకున్నారు.

టెన్త్ పరీక్షలకు 149 కేంద్రాలు



మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

పొందూరు: జిల్లాలో ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు 149 కేంద్రాలను సిద్ధం చేసినట్లు డీఈఓ తిరుమల చైతన్య తెలిపారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టెన్త్ పరీక్షలకు 29,984 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు 8 కేంద్రాల్లో జరుగుతాయని, 807 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- ఏపీఓకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డ్వామా పీడీ ఆదేశం



ప్రజా వేదికలో పాల్గొన్న పీడీ సుధాకరరావు, అధికారులు

జలుమూరు: మండలంలోని ఉపాధి పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, టెక్నికల్ అసిస్టెంట్లు పనుల పరిశీలనకు వెళ్లకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం జరిగిన ప్రజావేదికలో పీడీ పాల్గొని మాట్లాడారు. 40 పంచాయతీల్లో ఉపాధి, ఇరిగేషన్, హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు సంబంధించి రూ.29.76 కోట్ల నిధులతో పనులు చేపట్టారు. దరివాడ, లింగాలవలస పంచాయతీల్లో ఉపాధి పనులు పారదర్శకంగా చేయడంపై పీడీ అభినందించారు. మిగిలిన 38 పంచాయతీల్లో రికవరీ మొత్తం రూ.3.82 లక్షలు, అపరాధ రుసుం రూ.1.20 లక్షలు విధించారు. ఈ మొత్తం టీఏ, ఎఫ్ఏలు నుంచి వెంటనే వసూలు చేయాలని ఏపీఓ శేఖర్‌ను ఆదేశించారు. కరకవలస పంచాయతీలో ఎక్కువగా దిద్దుబాట్లు, మస్తర్లలో తేడాలు, చెల్లింపుల్లో లోపాలను గుర్తించారు. పాగోడు పంచాయతీలో సుమలత అనే మహిళ జాబ్‌కార్డ్‌కు దరఖాస్తు చేస్తే మంజూరు చేయకపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జాబ్ కార్డ్ అందించాలని ఏపీఓ, ఈసీ పట్ట సోమేశ్వరరావులను ఆదేశించారు. ఎక్కువగా కరకవలస, జలుమూరు, పాగోడు, గొటివాడ, కరవంజ, నగిరికటకం, అచ్చుతాపురం పంచాయతీల్లో ఉపాధి పనుల మస్తర్లలో తేడాలు, మృతి చెందిన వారి పేరిట హాజరు వేయడం, దిద్దుబాట్లను గుర్తించారు. ఏపీఓ శేఖర్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఏపీడీ లోకేష్‌ను ఆదేశించారు. ఈసీ పట్ట సోమేశ్వరరావు, టీఏలపై తరచూ పత్రికల్లో వార్తలు రావడంపై ఆరా తీశారు. డీవీఓ స్వరూపరాణి, ఏపీడి లోకేష్, ఎంపీపీ వాన గోపి, ఎంపీడీఓ కె.అప్పల నాయుడు, ఎస్ఆర్పీ పున్నపు నాయుడు, డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడే.. సందడి



పొందూరు: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



నరసన్నపేట: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: మండలంలోని బాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం టి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల జరిగే రోజుల్లో ఆహార నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులు సలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు చల్ల వరప్రసాద్, జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టూరులో..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను హెచ్ఎం ఎం.డి.ఎల్.నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సందడిగా నిర్వహించారు. జిల్లాలో మెట్టూరు పాఠశాలకు మంచి గుర్తింపు ఉందని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక సర్పంచ్ మొజ్జాడ చక్రపాణి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

తాడివలసలో..

పొందూరు: మండలంలోని తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం, పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని హెచ్ఎం అన్నారు.

యువత పోరుకు తరలిన శ్రేణులు

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన నిధులు మంజూరు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన యువత పోరుకు ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: యువత పోరు కార్యమానికి బయల్దేరిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్టీ నాయకులు



పాతపట్నం: యువత పోరుకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెళియాపుట్టి: యువత పోరు కార్యక్రమానికి బయలుదేరిన పార్టీ శ్రేణులు



కొత్తూరు: యువత పోరు కార్యక్రమానికి తరలిన పార్టీ నాయకులు, కార్యకర్తలు